సాక్షి
ఆదిలాబాద్

సోమవారం : 10 : జూన్ : 2024



తెలుగు-ఆంగ్లం సమేతంగా..

విద్యార్థులకు ఆంగ్ల పాఠాలు తేలికగా అర్థమయ్యేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. పుస్తకంలో పాఠ్యాంశాలను ఓ వైపు ఆంగ్లంలో, మరోవైపు తెలుగులో ముద్రిస్తోంది. 2లో▸

నేటి నుంచి ప్రజావాణి

కైలాస్‌నగర్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నుంచి ప్రజావాణి పునఃప్రారంభం కానుంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కారణంగా మార్చి 18వ తేదీ నుంచి ఈ కార్యక్రమాన్ని నిలిపివేశారు. ఈ నెల 6వ తేదీతో ఎన్నికల కోడ్ ముగియగా ఈ కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీ నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0 /27.0

ఆకాశం పలుచోట్ల మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

తేమ ఉంటేనే విత్తనం వేయాలి

ఆదిలాబాద్‌రూరల్: భూమిలో తగినంత తేమ శాతం ఉన్నప్పుడే విత్తనాలు వేయాలని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య సూచించారు. ఆదివారం మండలంలోని పాచ్చర గ్రామంలో రైతులకు వానాకాలంలో సాగు చేసే పంటలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా విత్తనాలు విక్రయించేందుకు వస్తే టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేసి, రశీదు తీసుకోవాలని తెలిపారు. లోతు దుక్కులు దున్నుకుంటే పంటకు హాని కలిగించే పురుగులు చనిపోవడానికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏవో అష్రఫ్, ఏఈవో ప్రసాద్ తదితరులున్నారు.

నకిలీ విత్తన విక్రయాల నియంత్రణలో విఫలం



ఇచ్చోడలో మాట్లాడుతున్న బొర్రన్న

ఇచ్చోడ: మారుమూల గ్రామాల్లో నకిలీ బీజీ-3 విత్తన విక్రయాలను అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలమైందని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెం బొర్రన్న ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు చిరువ్యాపారులు నకిలీ బీజీ-3 విత్తనాలను గుజరాత్ నుంచి తీసుకువచ్చి మారుమూల గ్రామాల్లో రైతులకు విక్రయిస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు రమేశ్, కర్తర్ సింగ్, హన్మంత్ తదితరులున్నారు.

రజకుల అభివృద్ధికి కృషి



కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న గంగాధర్

ఆదిలాబాద్‌రూరల్: రజకుల అభివృద్ధికి కృషి చేస్తానని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ హామీ ఇచ్చారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన రజక సంఘం పట్టణ కార్యవర్గ సభ్యులను ఆదివారం జిల్లా కేంద్రంలో శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి తనవంతుగా తన నెల జీతం నుంచి రూ.లక్ష విరాళంగా అందించనున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లోనూ తనవంతు పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

రెండ్రోజుల్లో బదిలీ ఉత్తర్వులు

నార్నూర్: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల కౌన్సిలింగ్ ఉత్తర్వులు రెండ్రోజుల్లో విడుదల కానున్నట్లు టీఎస్ టీడబ్ల్యూటీయూ జిల్లా అధ్యక్షుడు విజయ్‌శేఖర్ తెలిపారు. ఆదివారం నార్నూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీలు, ప్రమోషన్ల ఫైల్‌పై సంతకం కోసం రాష్ట్ర నాయకత్వం సోమవారం సీఎం, ఉన్నతాధికారులను కలవనున్నట్లు తెలిపారు. భాషాపండితులు, పీఈటీల అప్‌గ్రెడేషన్ కోసం కూడా తీవ్రంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట జిల్లా గౌరవాధ్యక్షుడు మడవి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి జె శివాజీ, అసోసియేట్ అధ్యక్షుడు టేకం గోవిందరావు, రాష్ట్ర కౌన్సిలర్ భూమేశ్, ట్రెజరర్ చౌహాన్ నెహ్రూ తదితరులున్నారు.

నూతన కార్యవర్గం



ప్రశాంత్

ఎదులాపురం: తెలంగాణ రాష్ట్ర జూనియర్ అటవీ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన బాణావత్ ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని అరణ్య భవనంలో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ప్రశాంత్ ప్రస్తుతం ఆదిలాబాద్ బీట్ అధికారిగా పని చేస్తున్నారు. అతడిని పలువురు అటవీ ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.



ఆదిలాబాద్ బల్దియా కార్యాలయం

చేతివాటానికి చెక్!

- పక్కదారి పడుతున్న ఆస్తిపన్ను సొమ్ము
- ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిగా నిర్ధారణ
- ఇక రెగ్యులర్ ఉద్యోగులతో వసూలు
- ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసిన సర్కారు

పట్టణంలోని వార్డులు: 49
అసెస్‌మెంట్లు : 46,528
ఆస్తిపన్ను డిమాండ్ : రూ.11.50కోట్లు
బల్దియాలోని బిల్ కలెక్టర్లు : 8 మంది



పన్ను వసూలు చేస్తున్న బల్దియా సిబ్బంది (ఫైల్)

కైలాస్‌నగర్: బల్దియాలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా, కార్మికులు, సిబ్బందికి జీతభత్యాలు చెల్లించాలన్నా పట్టణంలో వసూలయ్యే ఆస్తిపన్నే కీలకం. అధికారులు ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో ఆస్తిపన్ను వసూలు చేయిస్తున్నారు. ఇదే అదనుగా భావించి కొంతమంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పన్నుల రూపంలో వసూలైన సొమ్మును బల్దియా ఖాతాల్లో జమ చేయకుండా పక్కదారి పట్టిస్తున్నారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడిన వారిపై శాఖాపరంగా చర్యలు చేపట్టే అవకాశం లేనందున ప్రభుత్వం తాజాగా పన్ను వసూళ్ల విధానంలో మార్పులు చేసింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవలకు స్వస్తి చెబుతూ ఇక నుంచి రెగ్యులర్ ఉద్యోగులతో మాత్రమే ఆస్తిపన్ను వసూలు చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా బల్దియా అధికారులు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. ఫలితంగా పన్ను వసూళ్లలో అక్రమాలకు చెక్ పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చేతివాటం నిర్ధారణతోనే..

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఆస్తిపన్నును ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ద్వారా వసూలు చేయిస్తున్నారు. దీంతో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చేతియంత్రాలు (హ్యాండ్ హెల్డ్ మిషన్) రెగ్యులర్ ఉద్యోగుల పేరిటే ఉన్నాయి. కానీ, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి పీటీఐఎన్ (ప్రాపర్టీ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నంబర్) మిషన్‌లో నమోదు చేసి ఇంటి యజమానులపై ఎంత పన్ను ఉందో చెప్పి వసూలు చేసేవారు. ఇందుకు సంబంధించిన రశీదులను అందించేవారు. ఇలా రోజువారీగా సేకరించిన డబ్బులను బల్దియాలోని క్యాష్ కౌంటర్‌లో జమచేసే వారు. అయితే చాలాచోట్ల పలువురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. బల్దియాలో జమ చేయాల్సిన ఆస్తిపన్ను డబ్బులు పక్కదారి పట్టించి అక్రమాలకు పాల్పడుతున్నట్లుగా నిర్ధారించింది. దీంతో ప్రజాధనం పక్కదారి పడుతున్నట్లుగా తేలడంతో పాటు అవకతవకలకు పాల్పడేవారు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కావడంతో వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోతోందని గుర్తించింది. దీంతో వారిని ఆస్తిపన్ను వసూళ్ల బాధ్యతల నుంచి తప్పించాలని ఆదేశించింది. ఇకనుంచి రెగ్యులర్ ఉద్యోగులతో మాత్రమే పన్నులు వసూలు చేయించాలని సూచించింది. ఇందుకు ఉత్తర్వులు జారీ చేసింది.

మార్పులకు కసరత్తు షురూ..

పురపాలకశాఖ జారీచేసిన ఉత్తర్వులకు అనుగుణంగా ఆదిలాబాద్ బల్దియా రెవెన్యూ అధికారులు ఆస్తి పన్ను వసూళ్లలో మార్పులకు కసరత్తు చేపట్టారు. మున్సిపల్ పరిధిలో రెగ్యులర్ ఉద్యోగులైన ఎనిమిది మంది బిల్ కలెక్టర్లు, వీఆర్ఏల నుంచి నియమితులైన ఏడుగురు, మరో ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లను పన్నుల వసూళ్ల కోసం నియమించారు. హ్యాండ్ హెల్డ్ మిషన్లను వారి పేరిటే కేటాయించి ప్రతి ఒక్కరికీ లాగిన్ ఐడీలు కేటాయించారు. దీంతో వీరంతా నూతన నిబంధనల ప్రకారం పట్టణంలో ఆస్తిపన్ను వసూలు చేయనున్నారు. దీంతో అక్రమాలను అరికట్టడంతో పాటు పన్నుల వసూళ్లలో పారదర్శకత పెరగనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకవేళ వీరూ అక్రమాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉండటంతో అందుకు ఆస్కారం ఉండకపోవచ్చనే వాదన వినిపిస్తోంది.

18 మందికి బాధ్యతలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు రెగ్యులర్ ఉద్యోగులకే పన్ను వసూలు బాధ్యతలు అప్పగించాం. 18మందికి మిషన్లు కూడా అందించాం. వారి పేరిట లాగిన్ ఐడీలనూ కేటాయించాం. వార్డుల వారీగా ఉద్యోగుల వివరాలతో పాటు వారి సెల్ నంబర్లనూ బల్దియాలోని నోటీస్‌బోర్డుపై ఉంచాం. దీంతో వారు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి పన్నులు వసూలు చేయనున్నారు. పట్టణ ప్రజలకు అందించే పన్ను డిమాండ్ నోటీస్‌పై కూడా సంబంధిత ఉద్యోగి సెల్ నంబర్ ఉంటుంది. వారిని సంప్రదించి పన్నులు చెల్లించవచ్చు. లేదంటే బల్దియా కార్యాలయంలోని సిటిజన్ సర్వీస్ సెంటర్‌లోని ప్రత్యేక కౌంటర్‌లోనూ పన్నులు చెల్లించే అవకాశముంది.

– జాదవ్ కృష్ణ, బల్దియా రెవెన్యూ అధికారి



దుక్కిలో యంత్రంతో పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

సులువుగా.. వేగంగా..



పిచికారీ యంత్రంతో పోతారెడ్డి

సాగు పనుల్లో కూలీల కొరతను నివారించేందుకు రైతులు యాంత్రీకరణ బాట పడుతున్నారు. ఇందులో భాగంగా సులువుగా, వేగంగా పంటచేలల్లో రసాయనాలు పిచికారీ చేసే యంత్రం అందుబాటులోకి వచ్చింది. ఎద్దుల సాయంతో పిచికారీ చేసే ఈ బుల్‌కాట్ స్ప్రే యంత్రాన్ని భీంపూర్ మండలం కరంజి(టీ) గ్రామానికి చెందిన రైతు పోతారెడ్డి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి రూ.1.20 లక్షలతో కొనుగోలు చేసి తెచ్చాడు. దీని ద్వారా రోజుకు 10ఎకరాల్లో రసాయనాలు పిచికారీ చేసే అవకాశముంది. తక్కువ ఖర్చుతో నడిచే ఈ యంత్రం అందుబాటులోకి రాగా రైతులు హర్షం వ్యక్తంజేస్తున్నారు. – తాంసి

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమ్స్



పరీక్షాకేంద్రం ఎదుట క్యూలో నిల్చున్న అభ్యర్థులు

- 1,260 మంది అభ్యర్థుల గైర్హాజరు
- కేంద్రాలు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం



పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ రాత పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని 18 పరీక్షాకేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 6,729 మంది అభ్యర్థులకు 5,469 మంది హాజరు కాగా, 1,260 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహించారు. నిమిషం నిబంధన అమలులో ఉండగా అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకుని బారులు తీరారు. వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన సిబ్బంది ఉదయం 9గంటల నుంచి కేంద్రాల్లోకి, 10గంటల్లోపే గదులకు పంపించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేయగా సీఐ, ఎస్సై స్థాయి అధికారులు పరీక్ష ప్రారంభం నుంచి ముగిసేదాకా అక్కడే ఉండి భద్రతను పర్యవేక్షించారు. కలెక్టర్ రాజర్షి షాతో పాటు ఎస్పీ గౌస్ ఆలం పట్టణంలోని పలు పరీక్షాకేంద్రాలను పరిశీలించారు. పరీక్ష నిర్వహణపై ఆరా తీసిన అధికారులు అక్కడి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. కేంద్రాలకు సమీపంలోని ఇంటర్నెట్ కేంద్రాలు, జిరాక్స్ సెంటర్లు మూసివేయించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి వసతితో పాటు ప్రథమ చికిత్స అందించేలా వైద్యబృందాలను అందుబాటులో ఉంచారు. అభ్యర్థులతో వచ్చిన కుటుంబీకులు వారికి ఆల్ ది బెస్ట్ చెప్పి కేంద్రాల్లోకి పంపించారు. పరీక్ష ముగిసేదాకా అక్కడే ఉండటంతో కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఏఎస్పీ సురేందర్ రావు, డీఎస్పీలు జీవన్‌రెడ్డి, శ్రీనివాస్ పరీక్షాకేంద్రాల వద్ద భద్రతను పర్యవేక్షించారు.

మహిళా అభ్యర్థికి నిరాశ

పట్టణ శివారులోని చావర ప్రైవేట్ ఉన్నత పాఠశాలలోని పరీక్షాకేంద్రానికి పరీక్ష రాసేందుకు హాజరైన ఓ మహిళా అభ్యర్థినికి తీవ్ర నిరాశ ఎదురైంది. ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన సదరు అభ్యర్థిని కేంద్రం వద్ద భద్రత సిబ్బంది పరిశీలించారు. హాల్‌టికెట్, ఆధార్‌కార్డులో భర్త పేరు వేర్వేరుగా ఉందని ఆమెను కేంద్రంలోకి అనుమతించలేదు. అయితే తనకు వివాహమైందని, ఆధార్‌కార్డులో తన భర్త పేరు, హాల్‌టికెట్‌లో తన తండ్రి పేరు ఉందని ఆమె వారికి వివరించే ప్రయత్నం చేసింది. అయితే తండ్రి పేరు కలిగిన పాత ఆధార్‌కార్డు లేదా మరేదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని ఆమెకు సూచించారు. దీంతో ఇంటికి వెళ్లి గుర్తింపు కార్డు తీసుకువచ్చేసరికి సమయం 10.02 గంటలు కావడంతో నిమిషం నిబంధనతో ఆమెను కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో చేసేదేమీ లేక ఆమె నిరాశతో వెనుదిరుగాల్సివచ్చింది.

సమస్యల పరిష్కారానికి కృషి



జెండా ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండా ఆవిష్కరించారు. ముందుగా ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం బదిలీలు, ఉద్యోగోన్నతులను పారదర్శకంగా సకాలంలో పూర్తి చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి స్కావెంజర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. 317 జీవో ద్వారా స్పౌజ్ కేటగిరీలో బ్లాక్‌లో ఉన్న 13 జిల్లాలను వెంటనే అన్‌బ్లాక్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజ్జంకి రవీంద్ర, నాయకులు శీతల్ చౌహాన్, దిలీశ్ చౌహాన్, రవికుమార్, మల్లేశ్, షేక్ మునీర్, చంద్రశేఖర్, హర్షవర్ధన్, ప్రేమ్‌దాస్, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



విజేతలతో గోవర్ధన్‌రెడ్డి, పార్థసారథి

ఆదిలాబాద్: చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో కేకే స్విమ్మింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలను జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథితో కలిసి ఆయన ప్రారంభించారు. 5-18 ఏళ్ల బాలబాలికలకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తాయని చెప్పారు. చదువుతోపాటు చిన్నారులను వారికి ఆసక్తి గల అంశాల్లో తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. క్రీడా రిజర్వేషన్లు ఉద్యోగ సాధనను సులభం చేస్తాయని, ఈ దిశగా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే దేశానికీ క్రీడారంగంలో గొప్ప భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ అకాడమీ నిర్వాహకుడు కొమ్ము కృష్ణ, బీజేపీ నాయకుడు సోమ రవి తదితరులున్నారు.

‘నల్ల’కు విద్యాదాత పురస్కారం



నల్ల సుభాష్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: మావల గ్రామానికి చెందిన నల్ల సుభాష్‌రెడ్డిని వందేమాతరం ఫౌండేషన్ విద్యాదాత పురస్కారానికి ఎంపిక చేసింది. సోమవారం ఆయన హైదరాబాద్‌లో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. సుభాష్‌రెడ్డి తలమడుగు మండలంలోని తన స్వగ్రామం పల్లి(బీ)లో ప్రభుత్వ పాఠశాల కోసం రూ.20లక్షల విలువైన 41 గుంటల భూమిని విరాళంగా అందజేశారు. పేద విద్యార్థుల చదువులకు ఇబ్బంది తలెత్తకుండా, అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు భూమిని విరాళంగా అందించారు. ఈ బడికి తన తండ్రి లింగన్న స్మారక ప్రభుత్వ పాఠశాలగా నామకరణం చేశారు. సుభాష్‌రెడ్డి అవార్డుకు ఎంపిక కావడంతో పలువురు ఆయనను అభినందించారు.

మోదీ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్



ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేయగా కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాక్షితో మాట్లాడుతూ.. ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టడం గొప్ప విషయమని పేర్కొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

తలమడుగు మండలం బరంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన 60మంది పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. అప్పటి గురువులతో పూర్వవిద్యార్థులంతా పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. సహపంక్తి భోజనం చేశారు. ఉపాధ్యాయులు ఆదినాథ్, మహేశ్, సూర్యప్రకాశ్, వాసు, శారద, పూర్వవిద్యార్థులు రవి, మల్లయ్య, హనుమాండ్లు, మహేందర్, జగదీశ్‌రెడ్డి, సత్యనారాయణ, కార్తీక్, విజయ్, అర్చన, అన్నపూర్ణ, స్వప్న, జ్యోత్స్న, సుజాత, గ్రామ పెద్ద కేదారేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– తలమడుగు

‘ప్రమోషన్లలో ఎస్జీటీలకు నష్టం’

కైలాస్‌నగర్: భాషా పండితులు, పీఈటీ పోస్టులను జీవో 11, 12కు వ్యతిరేకంగా గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 2, 3, 9, 10 ప్రకారం అర్హత గల ఎస్జీటీలను కాదని ఏకపక్షంగా ప్రమోషన్లు కల్పించడం సరికాదని ఎస్జీటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడుగు నరేందర్, యాల్లా ఆకాశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఎస్జీటీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. పీఈటీలు, పండిట్‌లకు ప్రమోషన్లు ఇవ్వడం ద్వారా భవిష్యత్‌లో 2వేల మంది ఎస్జీటీలకు కూడా ప్రమోషన్లు రావని పేర్కొన్నారు. దీంతో భవిష్యత్‌లో ఎస్జీటీలు ప్రమోషన్లు లేకుండానే రిటైర్డ్ అవుతారని తెలిపారు. రెగ్యులర్ పోస్టింగ్‌కు అర్హత ఉన్నప్పుడు ప్రమోషన్‌కు ఎందుకు అర్హత లేదని, పండిట్‌లంతా గ్రేడ్-1 అయ్యాక రిటైర్డ్ అయితే ఆ పోస్టులను ఎవరితో భర్తీ చేస్తారని ప్రశ్నించారు. గతంలో అప్పటి ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా 10వేల పీఎస్ హెచ్‌ఎం పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తామని ప్రకటించిందని తెలిపారు. ఈ పోస్టులను ఈ షెడ్యూల్‌లోనే అమలు చేసి ఉద్యోగ విరమణ చేయబోయే ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.

క్లుప్తంగా

కండక్టర్‌కు గుండెపోటు



బాసర ప్రభుత్వ ఆస్పత్రిలో నేలపై కండక్టర్

బాసర: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కండక్టర్ శోభన్‌కు ఆదివారం గుండెపోటుకు గురయ్యాడు. బస్ డ్రైవర్ వెంటనే ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. నేలపై కండక్టర్ ఉన్నా నర్సులు, సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదు. ఆ సమయంలో అక్కడే ఉన్న మాజీ సర్పంచ్ రమేశ్ తన కారులో భైంసా ఏరియాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు, పశువుల కొట్టం దగ్ధం



కాలిపోయిన ఇల్లు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బాబాపూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి 2 గంటలకు షార్ట్ సర్క్యూట్‌తో కవల్కర్ లక్ష్మి ఇల్లు, కవల్కర్ సురేష్‌కు చెందిన పశువుల కొట్టం దగ్ధమైంది. చుట్టు పక్కలవారు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేశారు. వారు అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ఆర్‌ఐ సాయిప్రసాద్ పంచనామా నిర్వహించారు. కవల్కర్ లక్ష్మికి చెందిన 4 తులాల బంగారు, రూ.4 లక్షల నగదు, 5 క్వింటాల్ బియ్యం, నిత్యావసరాలు, టీవీ, మంచాలు దగ్ధమైంది. కవల్కర్ సురేష్‌కు సంబంధించి పశువల కొట్టంలో 40 బస్తాల డీఏపీ, 70 బస్తాలు యూరియా, వరి గడ్డి కాలిబూడదైంది. సుమారు రూ.1.50 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

కారు ఢీకొని నీలుగాయ్ మృతి



మృత్యువాతపడ్డ నీల్‌గాయ్

దిలావర్‌పూర్: కారు ఢీకొని నీలుగాయ్ మృతిచెందింది. మండలంలోని కాల్వ నరసింహ స్వామి ఆలయ స్వాగత తోరణం వద్ద ఆదివారం తెల్లవారుజాము ఈ ఘటన చోటు చేసుకుంది. భైంసా వైపు నుంచి వస్తున్న కారు వెళ్తుండగా అడ్డంగా నీలుగాయ్ రావడంతో ఢీకొట్టింది. దీంతో దూరాన పడి మృత్యువాత పడింది. కారును అధికారులు రోడ్డు పక్కన ఉంచారు. ఎఫ్ఎస్ఓ ఫారూఖ్ అలీ, ఎఫ్‌బీఓ మీనాలు నీలుగాయ్‌కి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకున్నారు. దిలావర్‌పూర్ పోలీసులు సైతం పరిశీలించారు.

అస్వస్థతతో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుడు ఏముర్ల రాజయ్య (56) శనివారం అస్వస్థతకు గురై మృతిచెందాడు. అమరవాది గ్రామానికి చెందిన రాజయ్య శనివారం అమ్మాగార్డెన్స్ ఏరియాలో విధులు నిర్వహిస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. అతన్ని తోటి కార్మికులు ఇంటి వద్ద విడిచిపెట్టగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు 108లో మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దహనసంస్కారాలకు కాంగ్రెస్ నాయకులు రూ.10వేల ఆర్థికసాయం చేశారు.

తెలుగు–ఆంగ్లం సమేతంగా..

- ద్విభాష పాఠ్యపుస్తకాల పంపిణీకి సిద్ధం
- ఈ విద్యా సంవత్సరం నుంచే 'పది'విద్యార్థులకు..
- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రయోజనం




ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయనున్న పాఠ్యపుస్తకాలు

నిర్మల్‌ఖిల్లా: మారుతున్న కాలానుగుణంగా మార్పులు చేసుకుంటూ ప్రభుత్వ విద్య ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. ఆంగ్ల మాధ్యమం ద్వారా ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించే అవకాశం ఉంది. ఇందుకుగాను పాఠ్యాంశాల రూపకల్పనలో విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని విద్యాశాఖ భావిస్తోంది. ఈ క్రమంలో గత మూడేళ్ల క్రితం నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టింది. ఏటా ఒక్కో తరగతి పెంచుతూ ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం బోధించనున్నారు. గతంలో సక్సెస్ పాఠశాలల పేరిట కొన్ని ఉన్నత పాఠశాలల్లో మాత్రమే ఆంగ్ల మాధ్యమ బోధన కొనసాగించారు.

2022–23 విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం ప్రారంభించారు. విద్యార్థులు పాఠాలు తేలికగా అర్థం చేసుకునేందుకు పుస్తకాల ముద్రణలో మార్పులు చేశారు. ఇందులోభాగంగా పాఠ్య పుస్తకాల్లో పాఠ్యాంశాన్ని ఒక పక్క తెలుగు, మరోవైపు ఆంగ్లంలో ముద్రించడం విశేషం.

పంపిణీకి ఏర్పాట్లు

మరో రెండు రోజుల్లో పాఠశాలల బడి గంటలు మోగనున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి ద్విభాష పాఠ్యపుస్తకాలు పంపిణీకి విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఉచిత పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుకోగా, మండలాల్లోని పాఠశాలలకు పంపిణీ ప్రక్రియ జరుగుతోంది. అయితే గత విద్యాసంవత్సరం వరకు 9వ తరగతి వరకు ద్విభాష (తెలుగు, ఆంగ్ల భాషలో) ప్రచురితమైన పుస్తకాలు పంపిణీ చేయగా, ఈ విద్యాసంవత్సరం నుంచి టెన్త్ విద్యార్థులకు ఆ మాదిరిగా పుస్తకాలు అందజేయనున్నారు.



రెండువైపులా రెండుభాషల్లో ముద్రితమైన పాఠ్యాంశంలోని పేజీ(ఫైల్)

రెండు విభాగాలుగా పుస్తకాలు..

ప్రతి పుస్తకాన్ని ఆంగ్లం, తెలుగులో ముద్రిస్తే పుస్తకం పేజీల సంఖ్య రెట్టింపై విద్యార్థులకు బరువు పెరగకుండా రెండు విభాగాలుగా విభజించారు. పార్ట్–1, పార్ట్–2 పేరిట విభజించిన రెండు పుస్తకాలను జూన్ నుంచి అక్టోబర్ వరకు మొదటి భాగం, నవంబర్ నుంచి మార్చి వరకు రెండవ విభాగాలుగా విద్యార్థులకు, ఈ సంవత్సరం నుంచి టెన్త్ విద్యార్థులకు పుస్తకాలు అందజేయనున్నారు. తద్వారా ద్విభాషా పాఠ్యపుస్తకాల వల్ల విద్యార్థులు సులభతరంగా నేర్చుకునేందుకు వీలుంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

తెలుగు, ఆంగ్లమాధ్యమాల్లో పాఠ్యాంశాలు..

తెలుగు మాధ్యమం నుంచి వచ్చిన గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆంగ్ల మాధ్యమం చదవాలంటే కొంత ఇబ్బందిగా ఉంటుందని భావించిన విద్యాశాఖ ప్రతి పుస్తకాన్ని రెండు భాషల్లో ముద్రించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషా పుస్తకాలు కాకుండా గణితం, సామాన్య, భౌతిక, జీవ, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలు ఎడమవైపు పేజీలో తెలుగులో, కుడివైపు పేజీలో అదే పాఠ్యాంశాన్ని ఇంగ్లిష్‌లో ముద్రణ చేయించారు. ఇక ప్రాథమిక స్థాయినుంచి పదో తరగతి వరకు అన్ని పాఠ్యపుస్తకాల్లో రెండు మాధ్యమాల్లో సులభంగా చదువుకునే అవకాశం ఉంది. ఇది విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉండనుంది.

కొత్త హంగులతో పుస్తకాలు..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే పుస్తకాలు కొత్త హంగులతో రూపొందించారు. ఆకట్టుకునే చిత్రాలు, కవర్ పేజీలతో ఉండనున్నాయి. పేజీలోని పాఠం పూర్తి వివరాల కోసం, సంబంధిత వీడియోల కోసం అక్కడ క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. మొబైల్‌తో స్కాన్ చేయగానే అదనపు సమాచారంతో కూడిన వీడియో, ఫోటోలు అందుబాటులోకి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇవి విద్యార్థులకు సరికొత్త ఆకర్షణీయంగా ఉన్నాయి.

పంపిణీకి ఏర్పాట్లు



ఈ విద్యాసంవత్సరం నుంచి టెన్త్ విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పుస్తకాల ముద్రణ పూర్తయింది. పాఠశాల ప్రారంభం రోజునే పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులు, ఉపాధ్యాయులకు బోధన అభ్యసన ప్రక్రియ సులువవుతోంది.

– డాక్టర్ ఏ.రవీందర్ రెడ్డి, డీఈవో

విద్యార్థులకు అవగాహన సులభం



గ్రామీణప్రాంత విద్యార్థులకు పాఠం అవగాహన కోసం సులభతరం అవుతోంది. ద్విభాషా పుస్తకాల విధానం ద్వారా మెరుగైన ఫలితాల సాధనకు తోడ్పడుతుంది. ఉపాధ్యాయులకు ప్రయోజనం. పుస్తకాలు రెండు పార్ట్‌లుగా ఉండటం వల్ల విద్యార్థులపై భారం ఉండదు.

– మైస అరవింద్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు, పొన్కల్

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బోథ్: మండలంలోని పూల్‌సింగ్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ భాస్కర్(58) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాము కథనం ప్రకారం.. భాస్కర్ కుటుంబ పోషణ కోసం రూ.2 లక్షల అప్పు చేశాడు. ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందాడు. ఆదివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరి..

తిర్యాణి: మండల కేంద్రానికి చెందిన ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన చిన్న పోషయ్య (55) మంచిర్యాల జిల్లా మందమర్రిలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, తిర్యాణిలో ఆయనకు సంబంధించిన వ్యవసాయ భూములు ఉండటంతో వాటిని చూసుకునేందుకు మూడు రోజుల క్రితం ఇక్కడే ఉంటున్నాడు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం ఎన్టీఆర్‌సాగర్ (చెలిమల) ప్రాజెక్టు కాలువ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా, మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

వాగులో పడి పశువుల కాపరి మృతి

రెబ్బెన: మండలంలోని నంబాల పరిధిలో గల మన్నెగూడకు చెందిన టేకం శంకర్ (52) ఆదివారం ప్రమాదవశాత్తు గోలేటి వాగులో పడి మృతి చెందాడు. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. గోలేటి పరిధిలోని దుర్గాపూర్‌కు చెందిన నాందేవ్ వద్ద పశువుల కాపరిగా శంకర్ పని చేస్తున్నాడు. రోజు మాదిరిగా ఉదయం మేత కోసం గోలేటి వాగు పరిసరాలకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వాగులో పడిపోయాడు. తోటి కాపరులు గమనించి నాందేవ్‌కు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకుని శంకర్‌ను ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుమారుడు విలాస్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య



నాగ్‌నాథ్ (ఫైల్)

ఇంద్రవెల్లి: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని సట్వాజీగూడ గ్రామంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. కుమురం భీం జిల్లా లింగాపూర్ మండలం మామిడిపల్లికి చెందిన నాగర్‌గోజే నాగ్‌నాథ్(35)కు ఆదిలాబాద్ జిల్లా సట్వాజిగూడకు చెందిన పార్వతితో 8 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా పార్వతి కొన్ని రోజులుగా పుట్టింట్లో ఉంటుంది. నాగ్‌నాథ్ ఆదివారం సట్వాజీగూడకు వచ్చాడు. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది అత్తగారి వ్యవసాయ చేనులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన బంధువులు 108లో రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతిచెందాడు.

మద్యం మత్తులో యువకుడి..

బేల: మండలంలోని చప్రాల గ్రామంలో యువకుడు తిరస్కార్ వినోద్(20) మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై కినక జీవన్ కథనం ప్రకారం.. వినోద్ గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి ఇంటి వద్ద మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లి, ఇరుగుపొరుగువారు రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి, మృతిచెందాడు. తల్లి సంగీత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఉరుకులు.. పరుగులు







ఆదిలాబాద్‌లో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 పరీక్షకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. నిమిషం ఆలస్యం నిబంధన ఉండడంతో అభ్యర్థులు కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. చివరి నిమిషాల్లో సమయం మించిపోతుండడంతో మరికొందరు ఇలా ఉరుకులు పరుగులు పెడుతుండగా 'సాక్షి'క్లిక్ మనిపించింది.– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

కేంద్రం చిరునామా తెలియక..

నిర్మల్‌లో గ్రూప్–1 పరీక్ష కోసం కేటాయించిన కేంద్రం చిరునామా తెలియక అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. కేంద్రానికి ఆలస్యంగా చేరుకోవడంతో అనుమతించలేదు. పోలీసు కార్యాలయం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రెండింటి ప్రవేశ ద్వారాలు ఒకటే ఉండడంతో గందరగోళానికి గురయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్





జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తా



నవనీత్



చరణ్ తేజ్



అఖిల్



శివ

- జిల్లా నుంచి పలువురు విద్యార్థులకు ర్యాంకులు
- విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే వినోద్, ఆర్సీఓ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తాచాటారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో విద్యార్థులు జాతీయ స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించి మెరిశారు. ఈసారి 9 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, ఆడే నవీన్ 1171 ర్యాంకు తెచ్చుకుని కళాశాల టాపర్‌గా నిలవగా, మిగతా ముగ్గురిలో దుర్గం చరణ్‌తేజ్ 2778, వెలుతురు అఖిల్ 3679, రాంటెంకి శివ 7476 జాతీయ ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. జేఈఈలో క్వాలీఫై అయిన సదరు విద్యార్థులకు జోసా కౌన్సెలింగ్‌లో సాధించిన ర్యాంకు ప్రాతిపదికన ఐఐటీలో సీటు కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందన

సదరు విద్యార్థులను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపరాణి ఫోన్ ద్వారా అభినందించారు. ఈ సందర్భంగా సీఓఈ ప్రిన్సిపాల్ సైదులు, అధ్యాపకులను ప్రశంసించారు. వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, అధ్యాపకులు నాగిని శ్రీరామ వర్మ, పిన్నింటి కిరణ్, చందా లక్ష్మీనారాయణ, మిట్టా రమేశ్, కట్ల రవీందర్, ముద్దసాని శోభ, ఆవునూరి రవి, అల్లూరి వామన్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు



చంటి



సాయికృష్ణ

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ (బాలుర) కళాశాలలో కొనసాగుతున్న స్టార్ 50లోని పలువురు విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించారు. ఇందులో పి.చంటి ఆలిండియా ఎస్టీ కేటగిరీలో 422 ర్యాంకు, ఎస్.సాయిక్రిష్ణ ఎస్టీ కేటగిరీలో 743వ ర్యాంకు జేఈఈ అడ్వాన్స్‌లో ప్రతిభ కనబర్చారు. శివ కుమార్ నీట్‌లో ఎస్సీ కేటగిరీలో 40,887 ర్యాంకు సాధించారు. మరికొందరు ఈఏపీసీఈటీ, ఎన్ఐటీ రంగాల్లో సీట్లు సాధించనున్నట్లు స్టార్ 50 కోఆర్డినేటర్ మారుతి శర్మ తెలిపారు.

ఉట్నూర్‌లో..



ఇంద్రవెల్లి: ఉట్నూర్ మండలం నర్సాపూర్‌కు చెందిన చవాన్ జైవంత్‌రావ్, అలిమా దంపతుల కుమార్తె మేగ్న జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో అలిండియా 68 ర్యాంకు సాధించారు. విద్యార్థిని ఈ ప్రాంత ప్రజలు అభినందించారు.

నర్సాపూర్(జి)లో..



నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన విశ్వక్‌సేన్ జేఈఈ (అడ్వాన్స్‌డ్) ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 1833 ర్యాంక్ సాధించాడు. తండ్రి నరేందర్ ప్రభుత్వ టీచర్ కాగా, తల్లి అనురాధ గృహిణి.

నిర్మల్‌లో..



నిర్మల్‌ఖిల్లా: ఇంద్రానగర్‌కు చెందిన గుర్రం రమాదేవి–వేణుగోపాల్ దంపతుల కుమార్తె సాయి మనోజ్ఞ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 2,514 జాతీయస్థాయి ర్యాంకు సాధించింది. ఆమెను పాకాల ఫౌండేషన్ చైర్మన్ రాంచందర్ దంపతులు సన్మానించారు.

ఆదిలాబాద్‌లో..



ఆదిలాబాద్‌టౌన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తాచా టారు. గ్రీన్‌సిటీ కాలనీకి చెందిన టీచర్ శివకుమార్–గీతా రాణి దంపతుల కుమారుడు కార్తీక్ ఓబీసీ కేటగిరిలో 1794వ ర్యాంక్ సాధించాడు. అదేవిధంగా నవీన్ యాదవ్–రమాదేవి దంపతుల కుమార్తె సిరి జాతీయ స్థాయి ఓబీసీ కేటగిరిలో 2236వ ర్యాంక్ సాధించింది.

వాంకిడిలో..



వాంకిడి: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన దుర్గం అర్జున్ ప్రతిభ చాటారు. ఆలిండియా స్థాయిలో 1782వ ర్యాంకు సాధించారు. తల్లిదండ్రులు దుర్గం మహేందర్–జ్యోతి, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, కళాశాల సిబ్బంది అర్జున్‌ను అభినందించారు.

విజయరాజ్‌కు 210వ ర్యాంకు



జన్నారం/లక్ష్మణచాంద: జన్నారం వాసి, లక్ష్మణచాంద లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీజీ హెచ్ఎం భుక్య రాజునాయక్–రూప దంపతుల కుమారుడు విజయరాజ్ జేఈఈ (అడ్వాన్స్‌డ్) ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 210 ర్యాంక్ సాధించాడు. విజయ్‌రాజును పలువురు అభినందించారు.

అ'పూర్వ' సమ్మేళనం



చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వీరి అపూర్వ సమ్మేళనానికి స్థానిక సంతోషిమాత ఫంక్షన్ హాల్ వేదికైంది. ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గురువులను సన్మానించారు.



రామకృష్ణాపూర్: పట్టణంలోని జెడ్పీ పాఠశాలకు చెందిన 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ఆర్‌కేసీఓఏ క్లబ్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. 34 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులంతా మొదటగా పాఠశాలలో కలుసుకుని అక్కడి నుంచి ర్యాలీగా క్లబ్‌కు చేరుకున్నారు. డీజే సౌండ్స్‌కు స్టెప్పులు వేస్తూ ఉత్సాహంగా ర్యాలీ చేపట్టారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ చిన్ననాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.



లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు.

క్లుప్తంగా...

ములుగు జిల్లాలో నాలుగు మందుపాతరల గుర్తింపు

- అప్పటికే పేలిపోయిన 3 ఐఈడీలు
- జంతు కళేబరాలు లభ్యం


పోలీసులు గుర్తించిన మందు పాతర

వెంకటాపురం.కె (ములుగు): తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని ములుగు జిల్లా వెంకటాపురం మండలం వీరభద్రవరం అటవీ ప్రాంతంలో పోలీసులు నాలుగు మందు పాతర (ఐఈడీ)లను గుర్తించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ శబరీష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో కొద్ది రోజులుగా పోలీసులు, బాంబ్ స్క్వాడ్ బృందాలు మావోయిస్టులు అమర్చిన మందు పాతరలను గుర్తించడానికి తనిఖీలు చేస్తుండగా ఈ నాలుగు మందుపాతరలను గుర్తించినట్లు వెల్లడించారు. వాటిలో మూడు పేలిపోయి ఉన్నాయని, సమీపంలో ముళ్లపంది, కొండెంగ, ఒక పెంపుడు కుక్క కళేబరాలను గుర్తించామని, మిగిలిన మందుపాతరను బాంబ్‌స్క్వాడ్ సహాయంతో నిర్వీర్యం చేసినట్లు తెలిపారు.

ఏటీఆర్, ఎన్ఎస్‌టీఆర్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు

ఏపీ,తెలంగాణ సంయుక్త సమావేశంలో వివిధ అంశాలపై చర్చ

సాక్షి, హైదరాబాద్: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్), నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్‌టీఆర్)లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధాన్ని కఠినతరంగా అమలు చేస్తామని తెలంగాణ పీసీసీఎఫ్ డోబ్రియాల్, ఆంధ్రప్రదేశ్ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి తెలిపారు. ఏ సమస్య తలెత్తినా రెండు రాష్ట్రాలు సుహృద్భావ వాతావరణంలో చర్చించి నిర్ణయాలు తీసుకుని ముందుకుపోవాలని నిర్ణయించామన్నారు. అమ్రాబాద్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో రెండు రాష్ట్రాల అధికారులు పాల్గొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుతో పాటు అడవులకు సంబంధించిన సరిహద్దు సమస్యలు, నివాస నిర్వహణ, రక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ ప్రాంతంలో తీర్థయాత్రల సందర్భంగా భక్తుల తాకిడి పెరుగుతుండటంతో ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉందని అధికారులు తెలిపారు. రెండు టైగర్ రిజర్వ్‌లలో ప్రత్యేకంగా తాగు నీటి కోసం ప్రత్యామ్నాయాన్ని అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఏపీ చీఫ్ వైల్డ్ వార్డెన్ ఏకే నాయక్, ఏటీఆర్, ఎన్ఎస్‌టీఆర్ అధికారులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో హైటెక్స్‌లో వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనం

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- హాజరుకానున్న దేశవిదేశాల వెడ్డింగ్ ప్లానర్లు, డిజైనర్లు



సనత్‌నగర్ (హైదరాబాద్): జాతీయ, అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ టూరిజం, తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ 3వ ఎడిషన్, 3వ టీసీఈఐ ఎస్ఐడబ్ల్యూయూపీసీ గ్లోబల్ 2024 బియాండ్ ఇమాజినేషన్, 7వ టీసీఈఐ ఈవెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 2024 వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు ఆదివారం బేగంపేట పర్యాటక భవన్‌లోని ది ప్లాజా హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ, భారతీయ వివాహ పరిశ్రమలోని నిపుణులను ఇది ఒకచోట చేర్చుతుందని, ఈ ఈవెంట్ ద్వారా వివాహాలకు దక్షిణాది నుంచి ముఖ్యమైన సహకారం, పరిజ్ఞానం, ప్రత్యేక వేదికను అందించడమే లక్ష్యమన్నారు. భారతీయ వివాహ వ్యవస్థలోని వివిధ అంశాలపై జ్ఞానయుక్తమైన సెషన్లు ఉంటాయని, జాతీయ, అంతర్జాతీయ వక్తలు ఈ సమావేశానికి హాజరుకానున్నారని తెలిపారు. ఈ కన్వెన్షన్ కోసం దేశవిదేశాల్లో ఉన్న 20కి పైగా వెడ్డింగ్ ప్లానర్లు, వెడ్డింగ్ డిజైనర్లు, వెడ్డింగ్ స్టైలిస్టులు, డెకరేటర్లు, ఈవెంట్ మేనేజర్లు, ఈవెంట్ ఇండస్ట్రీలోని ఇతర క్రాఫ్ట్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయన్నారు. ఈవెంట్‌కు సిడ్నీ నుంచి వెండీ ఈవెల్ ఖౌరీ సహా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నిపుణులు హాజరవుతారన్నారు. టెడ్డీ ఇమాన్యుయేల్ (ఫిలిప్పీన్స్), మైఖేల్ రూయిజ్ (ఫిలిప్పీన్స్), బ్రయాన్ టాచీ–మెన్సస్ (ఘనా) తదితరులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం దేశవిదేశాల నుంచి 700 మందికి పైగా ప్రతినిధులకు స్వాగతం పలుకుతోందన్నారు. 'ఈవెంట్ బజార్'గా పిలవబడే ఎక్స్‌పోలో 60కి పైగా స్టాల్స్‌లో గ్రాండ్ డిస్‌ప్లే ఉంటుందన్నారు. ఈవెంట్ పరిశ్రమలో ఉన్న విభిన్న ఉత్పత్తులు, సేవలు, అత్యాధునిక ట్రెండ్లను ప్రదర్శిస్తుందని చెప్పారు. ప్యానెల్ చర్చలు, వర్క్‌షాప్‌లు, ఈవెంట్ సేఫ్టీ, టెక్నాలజీ పాత్ర తదితర కీలక అంశాలపై సమాంతర సెషన్లు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ డైరెక్టర్ రమేశ్‌నాయుడు, హైటెక్స్ హెడ్ టీజీ శ్రీకాంత్, టీసీఈఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాంబాబు, ప్రధాన కార్యదర్శి రవిబురా, కోశాధికారి ఎండీ తౌఫిక్ ఖాన్, ఎస్ఐడబ్ల్యూయూపీసీ గ్లోబల్ 2024 కన్వీనర్ సాయి శ్రవణ్ మాదిరాజు, టీసీఈఐ ఈవెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 2024 కన్వీనర్ రామ్ ముప్పన, కో–కన్వీనర్లు హరీష్‌రెడ్డి, కుమార్‌రాజా, సుధాకర్ యారబడి, డాక్టర్ సౌరభ్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

- 'ఆటా' బిజినెస్ సెమినార్‌లో మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన అట్లాంటాలో 'ఆటా' బిజినెస్ సెమినార్‌లో ఆదివారం ప్రసంగించారు. హైదరాబాద్ సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి వికేంద్రీకరణ కోసం కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచానికి ఏఐ రాజధానిగా హైదరాబాద్‌ను రూపొందించే లక్ష్యంతో 200 ఎకరాలను ఏఐ పరిశ్రమల కోసం కేటాయించినట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే గ్లోబల్ ఏఐ సమ్మిట్‌కు అమెరికాలో స్థిరపడ్డ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు రావాలని కోరారు.

'సైబర్' బాధితులకు రూ.7.9 కోట్లు అందజేత


- సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును ఇప్పించిన అధికారులు
- జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసులు పరిష్కారం
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల చేతిలో డబ్బు పోగొట్టుకున్న బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు న్యాయం చేస్తున్నారు. ఈనెల 8న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఒక్క రోజులోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.7.9 కోట్లు తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించారు. బాధితులు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన సందర్భంలో వెంటనే సంబంధిత బ్యాంకు, సైబర్ సెక్యూరిటీ విభాగానికి చేసిన ఫిర్యాదుల ఆధారంగా నేరగాళ్లకు డబ్బులు వెళ్లకుండా ఫ్రీజ్ చేసి న్యాయ ప్రక్రియ ద్వారా అధికారులు బాధితులకు రీఫండ్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ లీగల్ సర్వీసెస్ అథారిటీ, అన్ని జిల్లాల పోలీసు విభాగాలు, పోలీసు కమిషనరేట్ల అధికారుల సమన్వయంతో జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైనట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీసీఎస్‌బీలో మొత్తం 4,144 కేసులు నమోదు కాగా, ఇందులో జూన్ 8న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసులలో బాధితులకు రూ.7.9 కోట్లు సొమ్మును తిరిగి ఇప్పించగలిగినట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లోనూ 803 కేసులు పరిష్కరించగలిగినట్టు తెలిపారు. సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శిఖాగోయల్ సూచించారు. అపరిచిత వ్యక్తులు, నంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లలోని లింక్‌లపై క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దని కోరారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్టు గుర్తిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న సొమ్మును తిరిగి కాపాడేందుకు అవకాశాలు ఎక్కువ ఉంటాయని శిఖాగోయల్ తెలిపారు.

విద్యుత్ స్తంభంపైనే ఆగిన ఊపిరి

- షాక్‌తో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి
- నాలుగు గంటలపాటు స్తంభంపైనే మృతదేహం



ఆదిలాబాద్ రూరల్: ఓ ఇంటికి విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తడంతో మరమ్మతులు చేసేందుకు కరెంట్ స్తంభం ఎక్కిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్.. దానిపైనే షాక్‌కు గురై మృతిచెందాడు. ఆదిలాబాద్ జిల్లా రాములుగూడలో ఈ ఘటన జరిగింది. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని రాములుగూడ గ్రామానికి చెందిన దడంజే మోతీరాం (35) కొన్నేళ్లుగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఓ ఇంటికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో మోతీరాంను పిలిచారు. ఆయన వచ్చి సరఫరాను పునరుద్ధరించేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. అయితే పైనుంచి వెళ్తున్న త్రీఫేజ్ విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కుగురై అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మోతీరాం మృతితో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనాస్థలికి చేరుకుని ఆందోళన చేశారు. తమకు పరిహారం చెల్లించే వరకు మృతదేహాన్ని కిందకు దించొద్దని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులు అక్కడికి రావడం ఆలస్యం కావడంతో మోతీరాం మృతదేహం స్తంభంపైనే నాలుగు గంటలపాటు ఉండిపోయింది. పోలీసులు, విద్యుత్ అధికారులు బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మోతీరాం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా మోతీరాం మృతికి.. తమకు ఎలాంటి సంబంధం లేదని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతిరెడ్డి తెలిపారు. విద్యుత్ స్తంభంపైకి ఎక్కిన మోతీరాం తమ లైన్‌మన్, జూనియర్ లైన్‌మన్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు.

హైవేలు రక్తసిక్తం

జాతీయ రహదారులు 44, 65పై ఘోర రోడ్డు ప్రమాదాలు

ఐదుగురు దుర్మరణం.. ఆరుగురికి గాయాలు

ఆదివారం రాష్ట్రంలోని రెండు జాతీయ రహదారులు రక్తసిక్తమయ్యాయి. 44వ నంబర్ హైవేపై జరిగిన ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా, హైవే 65పై చోటుచేసుకున్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. రెండు ఘటనల్లో మొత్తం ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు.

పెబ్బేరు రూరల్: వారంతా జైనమత ప్రచార బోధకులు.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కాలినడకన బయల్దేరిన వారిని డీసీఎం రూపంలో మృత్యువు వెంటాడింది. 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో ఓ సాధువుతోపాటు ఇద్దరు సహాయకులు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు స్వామీజీలకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన జైనమత ప్రచార బోధకులు విజ్ఞాన్‌ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహరాజ్, ప్రియాంకర్ మహరాజ్, వీరికి తోడుగా సహాయకులు భగవాన్ బాయ్, హేమల్ ప్రవీణ్ షాతో పాటు మరికొందరు ఈనెల 3న హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కాలినడకన బయల్దేరారు. మార్గమధ్యలో పెబ్బేరు మండలం రంగాపురం పాఠశాలలో శనివారం రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం నడక ప్రారంభించారు. గ్రామ శివారులో స్వామీజీలు వీల్‌చైర్‌లో కూర్చోగా, సహాయకులు తోసుకుంటూ వెళ్తుండగా.. కర్నూలు వైపు వేగంగా వెళ్తున్న డీసీఎం వారిని ఢీకొట్టింది. ప్రమాదంలో భగవాన్ బాయ్ (36), హేమల్ ప్రవీణ్ షా (40)లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. స్వామీజీలు విజ్ఞాన్‌ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహరాజ్, ప్రియాంకర్ మహరాజ్‌లకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హైవే అంబులెన్స్‌లో గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పునీత్ మహరాజ్ (45) మృతిచెందారు. మరో ఇద్దరు స్వామీజీలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

లారీల మధ్య ఇరుక్కుని నుజ్జునుజ్జయిన కారు..



సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): జాతీయ రహదారి 65పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది గ్రామ శివారులో ఆదివారం జరిగింది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా దేవరిప్పరిగి తాలూకా ఉన్నాల్ వాసి హాజీ షబాజ్ తన భార్య సమ్రీన్ (45), ఇద్దరు కుమారులు జునైద్, అబ్దుల్లాలతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లి పని చూసుకొని సొంతూరుకు వెళ్తున్నారు. నందికంది శివారు నాగ్సాన్‌పల్లి చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకుంటున్నారు. వారి వెనకాలే హైదరాబాద్ నుంచి సదాశివపేట వైపు అతివేగంగా వస్తున్న ట్యాంకర్ లారీ డ్రైవర్ మృత్యుంజయ దుబే(45) కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. అదే సమయంలో ఇటుగా జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు మరో లారీ వెళ్తోంది. దీంతో కారు.. రెండు లారీల మధ్య ఇరుక్కుని నుజ్జయింది. ఈ ఘటనలో కారులో ఉన్న సమ్రిన్, ట్యాంకర్ డ్రైవర్ మృత్యుంజయ దుబే ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ప్రమాదంలో హాజీ షబాజ్‌కు, అతని ఇద్దరు కుమారులకు, లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. చనిపోయిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాసరకు పోటెత్తిన భక్తులు


ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

బాసర: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతో ఉదయం నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మొదటిసారి స్కూలుకు పంపించే చిన్నారులతో తల్లిదండ్రులు అక్షర శ్రీకార పూజలు చేయించారు. అమ్మవారికి కుంకుమార్చన, గణపతి పూజ, అభిషేకం పూజలు నిర్వహించారు.

నకిలీ పాసుల కలకలం

అమ్మవారి ఆలయంలో మొదటిసారిగా నకిలీ వీఐపీ పాసులు కలకలం రేపాయి. భక్తుల రద్దీని గమనించిన ఓ గుర్తుతెలియని వ్యక్తి భక్తులకు వీఐపీ పాసులు అప్పజెప్పి డబ్బులు దండుకున్నట్లు ఈవో విజయ రామారావు దృష్టికి వచ్చింది. ప్రధాన ఆలయ ద్వారం వద్ద విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఓ భక్తుడి వద్ద నుంచి నకిలీ వీఐపీ పాస్‌ను పట్టుకున్నారు. అతన్ని నిలదీయగా డబ్బులు పెట్టి తీసుకున్నానని సమాధానం ఇచ్చాడు. ఏదేమైనా కొందరు వ్యక్తులు ఆలయ ప్రతిష్ఠతను దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్నారని, ఇలాంటి పాసులను ఎవరూ నమ్మవద్దని ఈవో భక్తులకు సూచించారు.

గిరిజన యువకుడికి నాలుగు పతకాలు


పృథ్వీరాజ్ రాథోడ్

నార్నూర్: మండలంలోని సోనాపూర్ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు పృథ్వీరాజ్ రాథోడ్ జాతీయస్థాయిలో షూటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి నాలుగు పతకాలు సాధించాడు. ఈనెల 8న గోవాలో జరిగిన పదో జాతీయస్థాయి రైఫిల్, పిస్టోల్ షూటింగ్‌లో పృథ్వీరాజ్ రాథోడ్ ఒక బంగారు, రెండు సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్ సాధించాడు. పృథ్వీరాజ్‌ను అసోసియేషన్ తెలంగాణ కార్యదర్శి భువనేశ్వరి, గ్రామస్తులు అభినందించారు.

క్రికెట్ క్రీడాకారుల ఎంపిక


జిల్లా నుంచి ఎంపిక చేసిన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అండర్–19, అండర్–23 క్రికెట్ ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన 34 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. అండర్ 19, అండర్ 23 టీంలకు వారిని ఆడించనున్నట్లు హెచ్‌సీయూ డిస్ట్రిక్ట్ సెక్రెటరీ కోదాటి ప్రదీప్ తెలిపారు. కార్యక్రమంలో కోచ్ పోరండ్ల ప్రదీప్, సీనియర్ క్రీడాకారులు చందు, గౌడపర్తి సుధీర్, బీమా రాకేశ్ పాల్గొన్నారు.

ఎంపికైన క్రికెటర్లు..

సి.కుశాల్‌రెడ్డి, ఆసిమ్‌ఖాన్, డి.లక్ష్మణ్, అబ్దుల్‌కైఫ్, జి.చరణ్, డి.రామ్, ఎస్‌డీ ఇజ్రాయెల్, ఎల్.సందీప్, దర్శ అగర్వాల్, డి.స్మిత్, జె.అవినాష్, జె.నందన్, ఎం.అక్షయ్, ఎస్.శాదాబ్, వి.సింహాద్రి, ఓ.సాత్విక్, జి.ఆశ్రిత్, జె.సంతోష్, ఉజైర్, సందీప్, ఎస్‌డి.ఖాసిఫ్, జె.చందన్, ఈ.గణేశ్, పి.శివ ప్రసాద్, ఎండీ అవాజ్, వి.సుభాష్, ఈ.సాయికుమార్, ఎ.చరణ్, వర్షిత్, ఎం.నిఖిల్ సాయిని ఎంపిక చేశారు. స్టాండ్ బైలో ఎస్‌డీ ఆదిల్, ఎండీ ఇమాముద్దీన్, డి.కార్తికేయ, కె.అబ్దుల్ రహీంను ఎంపిక చేశారు.

ముగిసిన బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు


క్రీడాకారులతో నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల గ్రీన్‌సిటీలోని మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పుల్లూరి సుధాకర్ విజేతల వివరాలు వెల్లడించారు. అండర్ 11, 13, 15, 17, 19 బాల బాలికలు, మెన్ అండ్ ఉమెన్, మాస్టర్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో వివిధ జిల్లాల్లో నిర్వహించే పోటీల్లో మన జిల్లా నుంచి పాల్గొంటారని తెలిపారు. విజేతలకు మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ డీజీఎం పంతుల, కాంగ్రెస్ నాయకులు బొలిశెట్టి కిషన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులు సత్యపాల్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, మధు, కృష్ణ, రాజలింగు, హర్ష, నరేందర్, రూబీ అకాడమీ బాధ్యుడు నరసింహాస్వామి పాల్గొన్నారు.

విజేతలు వీరే

బాలురు, మెన్ విభాగంలో అండర్–11 బాలుర సింగిల్స్‌లో శరవన్, అండర్–13, 15లో మన్విత్, అండర్ 15 డబుల్ బన్ని, శాను, అండర్–17 సింగిల్స్‌లో ఆదిత్య, డబుల్స్‌లో ఆకాశ్, లక్ష్మణ్, అండర్–19 సింగిల్స్‌లో ఆదిత్య, డబుల్స్‌లో అఖిల్, సాత్విక్, మెన్స్ సింగిల్స్‌లో రాజయ్య, డబుల్స్‌లో భీమ్‌రావు, సాయి ఎంపికయ్యారు. బాలికలు, ఉమెన్స్ విభాగంలో అండర్–11 సింగిల్ వి.హన్సిత, డబుల్స్‌లో హన్సిత, త్రిష, అండర్–15 సింగిల్స్‌లో అనన్య, డబుల్స్‌లో ఆషు, ఆరాధ్య, అండర్–18 సింగిల్స్‌లో అనన్య, అండర్–19 సింగిల్స్‌లో శ్రీవల్లి, ఉమెన్స్ సింగిల్ శ్రీవల్లి, అండర్–15 మిక్స్‌డ్ డబుల్ అనన్య, ధనుష్య, అండర్–17 మిక్స్‌డ్ డబుల్ అనన్య, రమ, అండర్–19 మిక్స్‌డ్ డబుల్ ఆద్య, శ్రీవల్లి, 35 ప్లస్ మెన్స్‌లో బి.హర్ష, 55 ప్లస్ మెన్స్ సింగిల్‌లో కె.కన్నయ్య, 40 ప్లస్ డబుల్స్ జయాకర్, శ్రీనివాస్, 65 ప్లస్ సింగిల్‌లో బి.కృష్ణ, 75 ప్లస్ సింగిల్‌లో పి.రాయలింగులు గెలుపొందారు.


క్యూలైన్‌లో భక్తులు


ఆలయంలో స్వామికి నమస్కరిస్తున్న భక్తులు


విప్‌ను శాలువాతో సత్కరిస్తున్న ఏఈవో

కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు (చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. పాఠశాలల సెలవులు ముగుస్తుండడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

అంజన్నను దర్శించుకున్న 'విప్' అడ్లూరి

కొండగట్టు అంజన్నను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకున్నారు. అర్చకులు ఆయనను శాలువాతో సన్మానించారు. కొండగట్టు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి కొండగట్టు మాస్టర్ ప్లాన్‌పై సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఏఈవో అంజయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



రాజన్నా.. సల్లంగచూడు

వేములవాడ: వేసవి సెలవులు సమీపిస్తుండడంతో రాజన్న దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఆదివారం 35వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఉక్కపోతను సైతం లెక్కచేయకుండా భక్తులు తమతమ కుటుంబ సభ్యులతో కలసి క్యూలైన్లలో స్వామి వారి దర్శనానికి క్యూకట్టారు. దర్శనానికి ఐదు గంటల సమయం పట్టింది.



జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జగిత్యాల విద్యార్థికి 334వ ర్యాంకు


జ్ఞానేష్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

జగిత్యాలజోన్: జాతీయస్థాయిలో నిర్వహించిన అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఇందులో జిల్లాకేంద్రంలోని గోవిందుపల్లి ప్రాంతానికి చెందిన గుండ జ్ఞానేష్ ఓపెన్ కేటగిరీలో 334వ ర్యాంకు సాధించాడు. కుటుంబ సభ్యులు స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకున్నారు. జ్ఞానేష్ తండ్రి శ్రీనివాస్ మేడిపల్లి మండలం వల్లంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తల్లి జయశ్రీ గృహిణి.

నేడు టీజీ పీఈసెట్ నైపుణ్య పరీక్షలు

కరీంనగర్‌సిటీ: శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్–2024(టీజీ పీఈసెట్)లో భాగంగా సోమవారం సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని టీజీ పీఈసెట్ కన్వీనర్ ఆచార్య రాజేశ్‌కుమార్ తెలిపారు. మొదటి రోజు పురుష అభ్యర్థులకు శారీరక సామర్థ్య, క్రీడా నైపుణ్యం పరీక్షలు ఉదయం 6.30 గంటల నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మొదటి రోజు రాష్ట్రంలోని వివిధ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల ఆచార్యులు, ఫిజికల్ డైరక్టర్లు, కోచ్‌లు, పరీక్షల నిర్వహణాధికారులు పాల్గొంటారని తెలిపారు. పురుష అభ్యర్థులకు 100 మీటర్లు, 800 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ ఒక విభాగంలో, మహిళ అభ్యర్థులకు 100 మీటర్లు, 400 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ ఒక విభాగంలో నైపుణ్య పరీక్షలు నిర్వహించనున్నామని చెప్పారు. ప్రతిరోజు 600 మంది విద్యార్థినీవిద్యార్థులకు పరీక్షలుంటాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఈనెల 13 వరకు కొనసాగుతాయని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.